క్లుప్తంగా

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలి



డిచ్‌పల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు విగ్నేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. విగ్నేష్ విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 21న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు ప్రసాద్, వెంకటేష్, సంధ్యారెడ్డి, మిథున్, లక్ష్మి, ప్రజ్ఞ, ఆకాష్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



సిరికొండ: మండలంలోని గోప్యతండా, సర్పంచ్‌తండా, ఒంటిప్పతండాలో గురువారం తీజ్ వేడుకలను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు నాయకులు భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. సర్పంచ్ సర్యనాయక్, పార్టీ మండలాధ్యక్షుడు రవి, డీసీసీ కార్యదర్శులు ఎర్రన్న, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు బీఎస్పీ ప్రచారం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మిర్చి కాంపౌండ్, ఆర్‌పి రోడ్, నెహ్రూ పార్క్, గాంధీ చౌక్ ప్రాంతాలలో గురువారం బహుజన్ సమాజ్ పార్టీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్ గడపగడపకు బీఎస్పీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు షకీల్ అహ్మద్, శ్యామ్, జాఫర్, రమేష్, గంగాధర్, మదన్ పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీని రైతులకు అప్పగించాలి



నిజామాబాద్ సిటీ: సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి, రైతులకు అప్పగించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు జలాల్‌పూర్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు ఫ్యాక్టరీ వాటాదారులు, రైతులు తరలిరావాలన్నారు. నాయకులు సాయిరెడ్డి, నారాయణరెడ్డి, సూర్యరెడ్డి, సాయరెడ్డి, రావేందర రెడ్డి, పెంటాజీ, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఇంటింటికి టీడీపీ'



ఖలీల్‌వాడి: నగరంలోని గాజులపేట, బోయిగల్లి ఏరియాలో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అర్బన్ ఇన్‌చార్జి వినోద్ కుమార్ టీడీపీ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు గంగాధర్, శంకర్, షేక్ ఫిరోజ్, అశోక్, నరసయ్య, రమేష్ గౌడ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలి

సుభాష్‌నగర్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం ఎస్సీ,ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.నాయకులు విశాల్, దీపిక, గణేష్, శ్రీకాంత్, సాయికిరణ్, సృజన్, కార్తీక్, హాస్టల్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సదస్సుకు తరలిరావాలి

సిరికొండ: జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించే రైతు సదస్సుకు రైతులందరూ తరలిరావాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ కోరారు. మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో ఏఐకెఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, గంగాధర్, నారాయణ, శంకర్, ఊశన్న, రాజేశ్వర్, గంగయ్య, నడ్పెన్న ఉన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలేవీ!

- నగరంలో రోడ్లు, మురికికాలువలను ఆక్రమిస్తూ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



ముబారక్‌నగర్‌లో కాలువను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం

నిజామాబాద్‌అర్బన్: నగరంలో నిబంధనలు పాటించకుండ పలువురు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో ఈ అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా ముబారక్‌నగర్, లక్ష్మీప్రియనగర్ ప్రాంతాల్లో బిల్డర్లు ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టి, విక్రయాలు జరుపుతున్నారు. ముబారక్‌నగర్ ప్రాంతంలో ప్రధాన రోడ్డు నుంచి పెద్దమ్మతల్లి టెంపుల్‌కు వెళ్లే రోడ్డులో ఈ అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది.

కాలువను ఆక్రమించి..

మారుతినగర్, గంగాస్థాన్ ప్రాంతాల నుంచి మురికినీరు, వర్షాలు పడే సమయంలో వచ్చే నీటిని ముబారక్‌నగర్ శివారులో ఉన్న చెరువుకు వెళ్లేందుకు కాలువ ఉంది. కొందరు బిల్డర్లు ఈ కాల్వను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల కాలువలో నీటి ప్రవాహం వల్ల అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు దెబ్బతిన్నాయి. అయినా బిల్డర్లు కాలువను పూర్తిగా మూసివేసి నిర్మాణాలు చేపడుతున్నారు.

మామూళ్ల జోరు..

నగరంలో అక్రమ నిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కుమ్మక్కై విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్రమంగా నిర్మించిన ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. దీనివల్ల బిల్డర్లు రెచ్చిపోయి ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నారు. ముబారక్‌నగర్ ప్రాంతంలో పెద్దమ్మతల్లి రోడ్డులో స్థానిక ప్రజాప్రతినిధి ప్రోత్సాహం వల్ల అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. వంద ఫీట్ల రోడ్డు ఉంటేనే ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి. కానీ ప్రస్తుతం ఈ రోడ్డు 20 ఫీట్ల వరకు కుచించుకుపోయింది. అయిన అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇచ్చిన హామీల కంటే రెట్టింపు అభివృద్ధి

- ఎన్నికల తర్వాతే డిచ్‌పల్లి మున్సిపాలిటీ
- రూరల్ నియోజకవర్గంలో జీటీ రోడ్ల నిర్మాణానికి రూ.19కోట్ల 16లక్షలు
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్





డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్.. కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): గత ఎన్నికల సమయంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ప్రజలకిచ్చిన హామీల కంటే రెట్టింపు అభివృద్ధి పనులు చేశానని, ప్రతిపక్ష పార్టీల నాయకులు చేసే విమర్శలను పట్టించుకోనని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ప్రజల కోరిక మేరకు అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా మారుస్తామన్నారు. డిచ్‌పల్లి లో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, ధర్పల్లిలో 100 పడకల ఆస్పత్రి, సిరికొండలో ప్రభుత్వ ఐటీఐ మంజూరు చేయించినట్లు తెలిపారు. మోపాల్ మండలంలో రూ.3,600 కోట్ల వ్యయంతో మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 3వేల మంది ఇండ్లు లేని పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున అందజేస్తామన్నారు. అదనంగా మరో 2వేల మందికి గృహలక్ష్మి అనుమతి వచ్చేలా కృషి చేస్తానన్నారు. అలాగే బీసీబంధు, మైనార్టీబంధు కింద వందలాది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.19 కోట్ల 16 లక్షల 50వేలు నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికలు ప్రక్రియ ప్రారంభానికి కంటే ముందుగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. అంతకుముందు డిచ్‌పల్లికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించిన ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద పార్టీ నాయకులు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, నాయకులు నారాయణరెడ్డి, శక్కరికొండ కృష్ణ, మోహన్‌రెడ్డి, సాయిలు, నీరడి పద్మారావు, అమీర్, ఒడ్డం నర్సయ్య, విఠల్, అంబర్‌సింగ్, లింగం, యూసుఫ్, జగదీశ్, దేవరాజ్, నయీం, నవీన్, కార్యకర్తలు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరికొండ: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బాజిరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన తన చిన్ననాటి మిత్రుడు లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ముబారక్ నగర్ గ్రామానికి చెందిన మాదిగ సంఘా భవనం నిర్మాణాని రూ 7.50 లక్షలు నిధుల ప్రొసీడింగ్ పత్రాలను గురువారం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పంపిణీ చేశారు. కార్పొరేటర్ అనిల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: దేశంలోని బీసీలతోపాటు వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా స్వర్ణకారుల సంఘ భవనం వద్ద గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా యెండల మాట్లాడుతూ.. చేతివృత్తులపై ఆధారపడ్డ వారికి ప్రధాని కుశల్ యోజన కింద రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు ఆర్థికసాయాన్ని అందిస్తూ ఆదుకుంటున్నారని గుర్తుచేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మల్లేష్ గౌడ్, మారుతి, జిల్లా విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కిషన్, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షులు టి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే డబుల్ లైన్ మంజూరుపై హర్షం..

ముత్కెడ్ నుంచి డోన్ వరకు డబుల్ రైల్వే లైన్‌కు నిధులు మంజూరు చేయడంతో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు నగరంలోని రైల్వే స్టేషన్‌లో ప్రధాని మోదీ, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్, ఎంపీ అర్వింద్ ధర్మపురి చిత్రపటాలకు గురువారం కంఠేశ్వర్ మండల అధ్యక్షుడు రోషన్ లాల్ బోరా, పార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్పొరేటర్, నాయకులు ఎర్రం సుధీర్, బుస్సాపూర్ శంకర్, ఆశిష్, స్వామి నాథ్, టింకు, కార్తీక్, ప్రసన్న, రమేష్, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

జ్యూట్ బ్యాగుల పంపిణీ

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) అంగన్‌వాడీ సెంటర్‌ను గురువారం సీడీపీవో స్వర్ణలత సందర్శించారు. పిల్లల తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పిల్లలకు జ్యూట్ బ్యాగులు, వాటర్‌బాటిల్స్, బ్లాక్ బోర్డు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ధర్పల్లి: మండలంలోని దమన్నపేట్‌లో గురువారం ప్రభుత్వ ఆయుర్వేద విభాగం వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో పలువురికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యురాలు మాధవి, సర్పంచ్ కొండ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్, కేశ్‌పల్లి గ్రామాల్లో గురువారం మండల పశువైద్యాధికారిణి శిరీషా పలువురు లబ్ధిదారులకు రెండో విడత కింద గొర్రెలను పంపిణీ చేశారు. సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ రిత్విక్, మహేశ్వర్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటవస్తువులు..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సూర్యనగర్‌లో గల ఆదిత్య స్కూల్‌లో గురువారం శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటవస్తువులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు రామ్‌మోహన్, శ్రీనివాస్, రాజశేఖర్, వేణుగోపాల్, రామ్ ఉన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఆర్ఎం

ఖలీల్‌వాడి: ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను రీజినల్ మేనేజర్ జానీరెడ్డి, నిజామాబాద్ డిపో–2 మేనేజర్ నల్లసాయన్న గురువారం కలిశారు. నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ తండాలో గురువారం గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై అధికారులు సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓ లింగం, ఇతర సిబ్బంది గృహలక్ష్మి దరఖాస్తులపై సర్వే నిర్వహించారు. ఇప్పటికే 80శాతం సర్వే పూర్తయ్యిందని, వీలైనంత త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఎంపీవో ఇక్బాల్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నుడా చైర్మన్‌కు సన్మానం..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నుడా చైర్మన్‌గా నియమితులైన ఈగ సంజీవ్‌రెడ్డిని నగర శివారులోని బోర్గాం(పి)లోగల తన నివాసంలో వివిధ సంఘాలు, పార్టీలు, ప్రజాప్రతినిధులు, గ్రామాలు, డివిజన్ల నాయకులు గురువారం కలిసి ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

వీఆర్ఏలను యథాతథంగా కొనసాగించాలి

సుభాష్‌నగర్: రాష్ట్రంలో వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్ఏలను యథాతథంగా కొనసాగించాలని యువజన సంఘం నాయకులు గురువారం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కపిల్, సాయి, శివ, సతీష్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: నగరంలోని హమాల్‌వాడి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న 60 గజాల స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత్ కళ్యాణ్ సమితి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు దౌలత్ చక్రే తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

ధర్పల్లి: నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం ధర్పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల పేదల సొంతిటి కల, కలగానే మిగిలిపోయిందని అన్నారు. నాయకులు గంగారెడ్డి, మహిపాల్, నరేష్ గౌడ్ ,గణేష్ ,సదానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కలీంకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జగడం పోచన్న, మండల కార్యదర్శి కొప్పు రాజేందర్, నాయకులు అశోక్, గంగారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి చెందినట్లు తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే షకీల్ చేసిన అభివృద్ధి ఏమి లేదని, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి హయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, సిరికొండ గంగారెడ్డి ఉన్నారు.

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఖానాపూర్ రోడ్‌లోగల ఏఐటీయూసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి సంధ్యారాణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. నాయకులు హన్మాండ్లు, సాయి, భాగ్యమ్మ, సవిత, రాణి, సరస్వతి, సావిత్రి పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చుని నిరసన

ఖలీల్‌వాడి: నిరవధిక సమ్మెలో భాగంగా ఏఎన్ఎంలు గురువారం ధర్నాచౌక్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. సమ్మెకు తెలంగాణ రక్షణ సమితి నాయకులు పిప్పిరి లావణ్య, రాథోడ్ సాయికుమార్ మద్దతు ప్రకటించారు. ఏఎన్ఎంలు నాయకులు పుష్ప, కవిత, ధనమ్మ గంగ జమున, ప్రమీల, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల కారణంగానే బ్రేక్‌డౌన్స్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని డీ–5 సెక్షన్ పరిధిలోగల ముబారక్‌నసబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో బ్రేక్ డౌన్స్, ట్రిప్ అవుతుందని ఏడీఈ తోట రాజశేఖర్, ఏఈ రామ్ సింగ్ తెలిపారు. విద్యుత్ అంతరాయంపై గురువారం సాక్షిలో 'తరచుగా బ్రేక్‌డౌన్' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి, మాట్లాడారు. వదులుగా ఉన్న వైర్లు, వంగిన స్తంభాలు ఉండడంతో వాటిని తీసేసి, కొత్త స్తంభాలు వేస్తున్నామన్నారు. అలాగే ఓవర్‌లోడ్ కారణంగా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లను సైతం వేసిన్నట్లు తెలిపారు. ముబారక్‌నగర్ పరిధిలో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకుండా చూస్తామని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న హెచ్‌ఈవో శంకర్

డిచ్‌పల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన భోజనం అందించాలని ఆరోగ్య విస్తరణాధికారి (హెచ్‌ఈవో) శంకర్ సూచించారు. మండలంలోని ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో సమావేశం నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, చదువుపై, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సంగీత, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మానస, ఆరోగ్య కార్యకర్త సావిత్రి, ఆశా కార్యకర్తలు స్వప్న, భువనేశ్వరి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు ఇందూరు తిరుమలలో కుంకుమార్చన

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల గోవింద వనమాల వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని నర్సింహారెడ్డి కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో ఒకటి, ఎంపీసీలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గోదావరి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 9 కి పైగా జీపీఏ సాధించిన విద్యార్థినులు నేరుగా వచ్చి సంప్రదిస్తే సీటు కేటాయిస్తామని తెలిపారు. ఎంపీసీలో బీసీ కేటగిరిలో–1, ఎస్టీ –1, బైపీసీలో బీసీ –1 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఒకేషనల్ కోర్సులో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ శివారులోగల సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పూర్వ ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ ఒకేషనల్ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఎస్సెస్సీలో సాధించిన జీపీఏ మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. అర్హత, ఆసక్తిగల బాలికలు కళాశాలలో ఈనెల 18న సంప్రదించాలన్నారు.

బోధన సిబ్బంది కోసం..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ సెకండియర్ వరకు ఇంగ్లీషు బోధన కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు గంటకు రూ.182 చొప్పున నెలకు గరిష్టంగా రూ.18,200 చెల్లిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

నేడు ఖిల్లా రామాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

డిచ్‌పల్లి: ఖిల్లా రామాలయం నూతన పాలకమండలి శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ కవిత, ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ హాజరు కానున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ గడ్డం రాధకిష్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల గడువు పెంచాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): గృహలక్ష్మి పథకం దరఖాస్తుల గడువు తేదీని పెంచాలని బీజేపీ మండల అధ్యక్షుడు ద్యాప రవి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ మునీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. గడువు పెంచకుంటే ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. నాయకులు అరవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,700	వెండి (కిలో)	74,200
22 క్యారెట్స్	56,347		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	30	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	25	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	35	60	దోసకాయ	20	30
దొండకాయ	35	60	ఆలుగడ్డ	17	30
బీర్నీసుకాయ	50	70	గోబిగడ్డ	18	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	25	40
వంకాయ	30	50	బీట్‌రూట్	35	50
పాలకూర	30	50	కరివేపాకు	45	60
మెంతికూర	35	50	చామగడ్డ	35	50
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	35	50
పుదీనా	50	70	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: జైలర్(తెలుగు)- 1.10,4.20,7.30, 10.40
- స్క్రీన్-2: యోగి(తెలుగు)-1.40; జిలేబి(తెలుగు)-4.40; పిజ్జా 3 ది మమ్మీ-7.40; మిస్టర్ ప్రెగ్నెంట్(తెలుగు)-10.30
- స్క్రీన్-3: గదర్-2(హిందీ) -1.10,4.20,10.30; భోళాశంకర్(తెలుగు)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: గాంధీ(తెలుగు)-10.00; రఘువరన్-బిటెక్(తెలుగు)-1.20; జైలర్(తెలుగు)-4.10; డీడీ రిటర్న్స్(తెలుగు)-7.35; గదర్-2(హిందీ) -10.20
- స్క్రీన్-2: గదర్-2(హిందీ)-12.00; జైలర్(తెలుగు)- 3.35,6.35,10.00
- స్క్రీన్-3: జైలర్(తెలుగు)- 10.00; పిజ్జా 3 ది మమ్మీ(తెలుగు)-1.25; బ్లూ బీటిల్(ఇంగ్లీష్)-4.25,10.30; యోగి(తెలుగు)-7.15
- స్క్రీన్-4: బ్లూ బీటిల్(తెలుగు)-10.10; ప్రేమ్‌కుమార్(తెలుగు)-1.00; భోళా శంకర్(తెలుగు) -4.10; మిస్టర్ ప్రెగ్నెంట్(తెలుగు)-7.30; ఓఎంజీ-2(హిందీ)-10.30

దేవి: రఘువరన్-బిటెక్(తెలుగు)- 8.00,2.15; యోగి(తెలుగు)- 6.00, 9.15

నటరాజ్: గదర్-2(హిందీ)

లలితామహల్: భోళా శంకర్(తెలుగు)

విజయ్: జైలర్(తెలుగు)